క్లుప్తంగా

ఐదో రోజు ఒక్క నామినేషన్ దాఖలు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేవీఎస్ రామారావు తెలిపారు. సామర్లకోట పట్టణానికి చెందిన కేశవరపు రామ్మోహనరావు ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఇప్పటి వరకు టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చిన రాజప్ప రెండు సెట్లు, నిమ్మకాయల రంగనాగ్ ఒక సెట్, బుంగా సత్యనారాయణ ఒకటి, శివకుమార్ రెండు సెట్లు, రామ్మోహనరావు ఒక సెట్ దాఖలు చేయగా ఇప్పటి వరకు ఐదు నామినేషన్లు ఏడు సెట్లు దాఖలయ్యాయని ఆర్డీవో జేవీఎస్ రామారావు చెప్పారు.

వలంటీర్ల రాజీనామాలు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. మండలంలోని మూలపేటలో ఒకరు, అమీనాబాద్‌లో ఎనిమిది, వాకతిప్పలో ఐదుగురు వలంటీర్లు రాజీనామాలు చేసి, తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

27న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెల జరిగే కౌన్సిల్ సాధారణ సమావేశంలో భాగంగా ఈనెల 27వ తేదీన కౌన్సిల్ హాల్‌లో సమావేశం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు హాజరు కావాలన్నారు.

నిప్పులు చెరుగుతున్న భానుడు



నిర్మానుష్యంగా సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి

సామర్లకోట: రోహిణి కర్తర్లు ప్రారంభం కాకముందే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. 26వ తేది వరకు పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో బంధుమిత్ర సపరివారంగా వెళ్లేందుకు హడలిపోతున్నారు. కల్యాణ మండపాలు దొరకని అనేక మంది ఇళ్ల వద్ద టెంట్లు వేసి భోజనాలు ఏర్పాటు చేయడంతో టెంట్ల నుంచి మరింత వేడి దిగి తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడం, వడగాడ్పులు వీయడంతో ప్రజలు అమల్లాడిపోయారు. మంగవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మానుష్యంగా మారింది.

ఘనంగా హనుమజ్జయంతి



పవమాన హోమం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: హనుమజ్జయంతి సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్టు కాలనీలో వేంచేసిన రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో మంగళవారం నాడు పవమాన హోమం ఘనంగా జరిగింది. మధ్వ పురోహితుడు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్వేష్ మాట్లాడుతూ ఉత్తరాది మఠ పీఠాధిపతుల సత్యాత్మ తీర్థ స్వామీజీ ఆజ్ఞానుసారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించామన్నారు. మధ్వసభ కమిటీ సభ్యులు రాచూరి రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ దాసాంజనేయ స్వామి ఐదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పవమాన హోమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మందిర నిర్వాహకులు యాతగిరి పరశురామ్, మధ్వసభ కమిటీ సభ్యులు టంకశాల శ్రీనివాసమూర్తి, బక్షి కేశవరావు, ఉదయగిరి శేషగిరిరావు, బారు గోవిందరావు పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పాలమ్మతల్లి తీర్థం

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి తీర్థం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో 15 రోజులు ముందు నుంచి అమ్మవారి గరగలను ఊరేగించారు. ఏటా చైత్ర పౌర్ణమి రోజున అమ్మవారి తీర్థాన్ని నిర్వహించడం పరిపాటి. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు తదితరులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముసాలమ్మతల్లి తరఫున సారె

వేములవాడ గ్రామదేవత ముసాలమ్మతల్లి ఆలయంతో మంగళవారం పుట్టింటివారు పుణ్యమంతుల అప్పారావు, సూర్యావతి దంపతులు, సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్ దంపతులు, 150 మంది మహిళలు పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల స్వీట్లు, పండ్లు, సారెతో ఉప్పాలమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో సారె ఉంచి ఉప్పాలమ్మ తల్లి ఆలయకమిటీ చైర్మన్ మురళీకృష్ణ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అందజేశారు.

చింత లేని ఆరోగ్యం

- నిరుపేదల ఇంటి వద్దకే వైద్య సేవలన్నీ..
- వైద్య వ్యవస్థలోనే విప్లవాత్మక మార్పులు
- విస్తరిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంతృప్తి
- అండగా నిలుస్తున్న ఆరోగ్యశ్రీ



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొత్తపల్లి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. పేదల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా వంటి పథకాలు గ్రామాల్లో పేద ప్రజలకు వరంగా మారాయి. గతంలో సామాన్యులకు ఏ చిన్న జబ్బు చేసినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్టణాలకు పరుగులు తీసేవారు. పూర్తి స్థాయిలో వైద్యం అందక లెక్కకుమించి ఖర్చు చేసేవారు. నేడు పరిస్థితి పూర్తిగా మారింది. ఫ్యామిలీ డాక్టర్ పథకం అమల్లోకి వచ్చాక, నెలకు రెండు సార్లు వైద్య బృందం గ్రామంలోకి వచ్చి రోగులకు పరీక్షలు చేసి, వెంటనే రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు.

ప్రతి రోజూ వైద్య సేవలు

మండలంలోని కొత్తపల్లి, నాగులాపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 18 గ్రామ పంచాయతీల్లోని 24 గ్రామ సచివాలయాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. ప్రతి రోజూ ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి క్యాంపులోను 100 నుంచి 150 మందికి వైద్య పరీక్షలు చేస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా బీపీ, షుగర్‌తో బాధపడుతున్న పేదలకు నెలవారీ వైద్య పరీక్షలు, మందుల కొనుగోలు భారం తగ్గింది. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు నిర్వహించే 104 వాహనంలోని ప్రతి నెలా వారికి పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. ప్రభుత్వ సేవలతో ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు.

గర్భిణులకు ఆరోగ్య ఆసరా

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెరుగుపరిచిన మరో పథకం ఆరోగ్య ఆసరా. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకున్న గర్భిణులకు ప్రోత్సాహం రూ.1,300 మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రసవానంతరం మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సుమారు రూ.11 వేల సాయం చేకూరుతోంది. తల్లీబిడ్డలను ప్రభుత్వ వాహనంలోనే ఇంటికి సురక్షితంగా చేరుస్తున్నారు. కాగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆయన తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు నిర్వీర్యం చేశారు. ఈ పథకం ద్వారా కొన్ని రకాల వ్యాధులకే నిధులు మంజూరు చేసేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పథకానికి ఊపిరి పోశారు. ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్లినిక్ కేంద్రాలను నెలకొల్పారు.

> **ప్రతి నెలా రెండుసార్లు వైద్య పరీక్షలు**
>
> ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రతి నెలా ఒక్కొక్క గ్రామంలో రెండు సార్లు నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒక గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నాం. 150కి పైగా ఓపీ నమోదు అవుతోంది. అంతేకాకుండా ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పరీక్షలతో పాటు, కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సురక్ష కార్యక్రమానికి 200 నుంచి 250 వరకూ ఓపీ వస్తోంది.
>
> – డాక్టర్ సౌజన్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నాగులాపల్లి

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రామారావు



ఓటింగ్ శాతం పెంచేలా ప్రదర్శన నిర్వహిస్తున్న కమిషనర్ తదితరులు

సామర్లకోట: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచే విధంగా ప్రదర్శనలు నిర్వహించారు. బయటకు రాలేని వారు తమ తమ పేర్లను నమోదు చేయించుకోవడం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం జరుగుతుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు పి. శ్రీనివాసరావు, ఏఎస్ఓ పెంకే శ్రీనివాసరావు, వీఆర్వోలు నల్లజర్ల మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పూజలు

తిరుపతిలో సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు మంగళవారం నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్, చైర్మన్ కర్రి జగదీష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా ఆలయ అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు ఈ పూజలు నిర్వహించారు.

వైభవంగా చండీహోమం

స్థానిక జి.రాగంపేట పుంతరోడ్డులోని శ్రీ రామభక్తాశ్రమం 52వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గీతా జ్ఞాన యజ్ఞం, చండీహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత మూడో షట్కం, జ్ఞాన యోగం గీతా యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతా సేవానందగిరి, కార్యదర్శి సత్యకుమార్, మేడిశెట్టి అంజిబాబు, నీలం శారదాదేవి, తుమ్మల వెంకట్రావు, పెచ్చెటి నూకామణి, ఖండవల్లి సూర్యనారాయణ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో చండీహోమం

చైత్ర పౌర్ణమి సందర్భంగా స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే అమ్మవారి చండీహోమంలో భాగంగా ఈ ఏడాది హోమాన్ని మరింత ఘనంగా నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనారావు ఆధ్వర్యంలో వేద పండితులు ఐవీ ప్రసాద్‌శర్మ, ఎన్‌వీ శాస్త్రి, ఏవీ భానుమూర్తి హోమాన్ని నిర్వహించారు.



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నూకాలమ్మతల్లికి కుంభాభిషేకం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని గ్రామదేవత నూకాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం కుంభాభిషేకం నిర్వహించారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా పౌర్ణమిని పురస్కరించుకుని సుమారు 108 మంది మహిళలు ఆలయం నుంచి గాంధీచౌక్, యార్లగడ్డవారి వీధి, దేవిచౌక్, స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ మీదుగా గరగల నృత్యాలు, డప్పుల డాన్సుతో గోదావరి కాలువ చేరుకొన్నారు. అక్కడి నుంచి నీటిని బిందెలలో తీసుకువచ్చి అమ్మవారిని అభిషేకించారు. అనంతరం ఆలయంలో సామూహిక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు. మధ్యాహ్నం, సాయంత్రం ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. బుధవారం అమ్మవారిని పసుపు, కుంకుమలతో అలంకరిస్తారని ఆలయ ధర్మకర్త బుల్లియ్య తెలిపారు.



గరగల నృత్యాల నడుమ బిందెల్లో నీరు తీసుకువస్తున్న మహిళలు

సంక్షేమం, అభివృద్ధిని చూసి గెలిపించండి

వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత



వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న గీత

గొల్లప్రోలు: గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గొల్లప్రోలు పట్టణంలో మంగళవారం ఆమె 17, 18, 19, 20 వార్డుల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఆమె ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటా స్థానికులు ఆమెకు హారతులిచ్చి సాదరస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంధ్రేటి శీరామచంద్రమూర్తి, మొగలి అయ్యారావు, జ్యోతుల భీముడు, మైనం రాజా, గంధం నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికుడైన దొరబాబును గెలిపించండి

- దవులూరి భార్య చంద్రకళ
- 31వ వార్డులో ఎన్నికల ప్రచారం



సామర్లకోట 31వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు భార్య చంద్రకళ

సామర్లకోట: స్థానికుడు, మీలో ఒకడైన తన భర్త దవులూరి దొరబాబును ఒకసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని పెద్దాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం రాత్రి 31 వార్డులో చైర్‌పర్సన్‌లు గంగిరెడ్డి అరుణ, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కన్వీనర్ మడికి సోనియా, కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, కరణం రాజ్‌కుమార్, వార్డు సీనియర్ నాయకుడు వేగి సత్యనారాయణలతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. అడుగడుగునా మహిళలు హారతి పడుతూ చంద్రకళకు స్వాగతం పలికారు. 22 ఏళ్లుగా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తన భర్త టిక్కెట్టు కోసం ప్రయత్నం చేస్తూ ఉండగా ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇచ్చారని తెలిపారు. సుమారు 40 ఏళ్లుగా స్థానికేతరులు పెద్దాపురంలో పరిపాలన చేస్తున్నారని, ఒకసారి స్థానికుడైన నా భర్తకు అవకాశం ఇస్తే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వినుకోటి విష్ణుచక్రం, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు రెడ్నం సునీత, పాలిక కుసుమ, కానేటి రాజేశ్వరి, పెండ్యాల నాగ వెంకటలక్ష్మి, స్వయంభూవు వీరభద్రరావు, పట్టణ గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు



జె.తిమ్మాపురంలో ఏర్పాటు చేసిన అనధికార లే అవుట్

పెద్దాపురం: మండలంలోని అనధికార అక్రమ లే అవుట్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్లు ఇదే అదునుగా చేసుకుని సుమారు మూడెకరాల స్థలంలో అనధికార లే అవుట్లు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన జగనన్న కాలనీకి ఇచ్చిన స్థలంలో సమీపంలో సీలింగ్‌కు సంబంధించిన సర్వే నెంబర్ 213లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లుగా విడదీసి విక్రయాలు చేపట్టారు. సందట్లో సడేమియా అన్నట్టుగా ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉంటారనే ఉద్దేశంతో ఈ అక్రమ లే అవుట్‌లో ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా సంబంధింత వ్యక్తులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని, అనధికార లే అవుట్‌లో బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

ఏపీఎస్పీ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం

ప్రారంభించిన కమాండెంట్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్, ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ రూరల్: రమణయ్యపేట వద్ద ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో సిబ్బందికి మెడికవర్ ఆస్పత్రి, బాల ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్యులు మంగళవారం ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలందించారు. శిబిరాన్ని బెటాలియన్ కమాండెంట్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ప్రారంభించారు. బెటాలియన్ సిబ్బందికి ప్రతి నెలా వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలను గుర్తించి, పరిష్కరించుకోవచ్చన్నారు. సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కె.బాలకిరణ్, డాక్టరు ప్రత్యూష, డాక్టరు సునీల్, వైద్యాధికారి లక్ష్మిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

జేవీకే స్టాక్ పాయింట్ పరిశీలన



శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్లో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఇస్మాయిల్

తొండంగి: సమగ్ర శిక్షా రాష్ట్ర పరిశీలకుడు ఇస్మాయిల్ జేవీకే కిట్లు భద్రపరిచే స్టాక్‌పాయింట్‌ను మంగళవారం పరిశీలించారు. శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్లో జేవీకే కిట్లు భద్రపరిచేందుకు ఐదు గదులను ఏర్పాటు చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వీటిని అందజేస్తారు. జేవీకే కిట్లు అత్యంత భద్రంగా ఉంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇస్మాయిల్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఆయన వెంట విద్యా శాఖ అధికారులు చామంతి నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఓటు వినియోగంపై 'సెల్ఫీ పాయింట్'



సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఆర్వో వెంకటరావు

ప్రారంభించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: 'ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకుంటా'... అన్న నినాదంతో ఓటర్లను చైతన్యవంతం చేసే దిశగా అధికారులు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఇందుకు సంబంధించిన ప్రచారబోర్డును సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ప్రారంభించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్లతో పాటు ఓటు హక్కు ఉన్నప్పటికీ ఓటు వేసేందుకు నిరాసక్తత కనబరిచే ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా విస్తృత ప్రచారం చేస్తున్నామని ఆర్వో వెంకటరావు చెప్పారు. ఓటు హక్కు కలిగిన ఓటర్ల కోసం 'సెల్ఫీ పాయింట్' పేరుతో ఈ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. యువత చైతన్యవంతులై ఓటు విలువ, ప్రాధాన్యాన్ని అర్థం చేసుకుని కచ్చితంగా వచ్చే మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్వో వెంకటరావు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తోపాటు వివిధ విభాగాధిపతులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

25న దొరబాబు నామినేషన్



నూకాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 25వ తేదీన ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు దవులూరి దొరబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సామర్లకోట పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి బడేలమ్మ చెరువు, బ్రౌన్‌పేట, పాత తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం మీదుగా పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. సుమారు 40 ఏళ్ల తరువాత స్థానిక అభ్యర్థికి పోటీ చేసే అవకాశం వచ్చిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని పార్టీలకు అతీతంగా తనను ఆశీర్వదించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలు తమ విజయానికి బలమని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ స్థానిక నాయకత్వాన్ని కోరుకొంటున్నారని, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తామనే ధీమా ఆయన వ్యక్తం చేశారు.

నూకాలమ్మ తల్లికి దొరబాబు పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 25న ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయనున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆయన వెంట జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ గోపు మురళి, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, పల్ల గంగారావు, జోకా నానాజీ తదితరులున్నారు.

లక్ష్మీగణపతి సన్నిధిలో మంత్రి రాజా

తుని: కొత్తపేట లక్ష్మీగణపతిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మంగళవారం దర్శించుకున్నారు. బుధవారం జరిగే నామినేషన్ కార్యక్రమం విజయవంతం కావాలని గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసారి ఎన్నికల్లో విజయాన్ని కటాక్షించాలని కోరుకున్నట్టు మంత్రి చెప్పారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేసి, ఆశీర్వదించారు. తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.